క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మునుగోడు: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బీసీ బాలికల హాస్టల్‌లో చేరాలనుకునే విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ జే.ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థినులు హాస్టల్‌లో చేరే అవకాశం ఉందని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, గత ఏడాది ప్రొగ్రెస్‌కార్డు, ఒక పాస్ ఫొటోతో మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు హాస్టల్‌లో సంప్రదించాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం(ఒకటో వార్డు)లో సీసీ కెమెరాలను మంగళవారం ఆ వార్డుకు చెందిన మత్స్యపారిశ్రామిక సంఘం చైర్మన్ నూతి సైదులుముదిరాజ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రుద్రవరం సహదేవులు, రుద్రవరం రామచంద్రం, చిర్రబోయిన వెంకటేష్, స్వామి, గణేశ్, మధు, నవీన్ పాల్గొన్నారు.

సీడీపీఓకు వినతి



సీడీపీఓకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మునుగోడు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు చాపల శ్రీను మంగళవారం సీడీపీఓ కవితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం అంగన్‌వాడీ సిబ్బందికి నెలకు రూ.18వేల వేతనం, పదవీ విరమణ పొందిన టీచర్‌కు రూ.10లక్షలు, ఆయాకు రూ.5 లక్షలు అందించాలని కోరారు. గతంలో 24 రోజులపాటు చేసిన సమ్మె కాలం వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది దాసరి అన్నపూర్ణ, నెల్లికంటి అన్నపూర్ణ, పారిజాత, ఇన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సూర్యాపేట కలెక్టర్‌కు సన్మానం



వెంకట్రావును సన్మానిస్తున్న డ్వాబ్ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్: బదిలీపై వెళుతున్న సూర్యాపేట కలెక్టర్ వెంకటరావును మంగళవారం డ్వాబ్ ప్రతినిధులు సూర్యాపేటలో కలిసి శాలువా, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏబీసీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కా రావు, పెండ్యాల దామోదర్‌రావు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగులు అందజేస్తున్న నర్సిరెడ్డి

కనగల్ : కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్, పగిడిమర్రి మాజీ సర్పంచ్ గోలి జగాల్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలను పగిడిమర్రి మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ లింగస్వామి, గోలి శేఖర్‌రెడ్డి, సుంకిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మహేష్, శిరీష, సంధ్య, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందజేత

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కొరివి వెంకన్న తన తల్లిదండ్రులు బుచ్చయ్య-సుశీల జ్ఞాపకార్థం నగదు ప్రోత్సాహకాలను మంగళవారం అందజేశారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాలాస శ్రీవిద్య(9.0 జీపీఏ)కు రూ.20 వేలు, పబ్బతిరెడ్డి సుష్మ(7.8)కు రూ.10 వేలు, అనీయాతబస్సుమ్(7.7 జీపీఏ)కు రూ.ఐదు వేల నగదు ప్రోత్సాహకాన్ని కొరివి వెంకన్న కూతురు అల్లుడు పాల్వాయి రజని-శ్రీనివాస్ అందజేశారు. హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, రవీందర్‌రెడ్డి, సైదులు, నాయకులు వనమా వెంకటేశ్వర్లు, ఇమ్మడి వెంకటేశ్వర్లు, పందిరి రమేష్, బూరుగు కృష్ణయ్య పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న దాత

హరితహారానికి శ్రీకారం

- చండూరు, గట్టుప్పల్ మండలాల్లో ముమ్మరంగా గుంతల తవ్వకం
- ఇప్పటికే ప్రారంభమైన మొక్కలు నాటే కార్యక్రమం
- ప్రతీ మొక్క బతికేలా ప్రణాళిక



చండూరు : చామలపల్లి గ్రామంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న ఉపాధిహామీ కూలీలు



గుండ్రపల్లి గ్రామంలో మొక్కలు నాటుతున్న కూలీలు

చండూరు : గట్టుప్పల్, చండూరు, మండలాల పరిధిలో హరితహారం కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ ఏడాది హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు పక్కా ప్రణాళిక తయారు చేసుకున్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంచేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు పల్లెల్లో నర్సరీలను ఏర్పాటు చేసి.. ఆ నర్సరీల్లో పెరిగిన మొక్కలను నాటేందుకు ఉపాధిహామీ అధికారులు స్థలాలను గుర్తించి మొక్కలు నాటే కార్యక్రమం చేట్టారు.

చండూరు గట్టుప్పల్ మండలాల్లో ఇలా..

పదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా చండూరు మండలంలోని వివిధ గ్రామాల్లో 26 నర్సరీలు, గట్టుప్పల్ మండలంలో 7 నర్సరీలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రతి నర్సరీలో 5500 మొక్కల చొప్పున సుమారు 20 రకాల మొక్కలను పెంచారు. ఉపాధి హామీ పథకం ద్వారా నియమించిన వన సంరక్షకుల ద్వారా నర్సరీలో మొక్కల పెంపకం, సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఆయా నర్సరీలను ఉపాధిహామీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రతి నర్సరీలో కానుగ, గుల్మోహన్, మునగ, సీమ తంగేడు, ఖర్జూర, దానిమ్మ, మందారం తదితర మొక్కలను పెంచారు.

లక్ష్యం ఇలా..

చండూరు మండలంలో హరితహారంలో లక్ష మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. అదేవిధంగా గట్టుప్పల్ మండలంలో 40 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే చండూరు, గట్టుప్పల్ మండలాల్లో లక్ష్యానికి అనుగుణంగా గుంతలు తవ్వారు. వాటిలో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది.

పచ్చదనం పరచుకునేలా...

నర్సరీల్లో పెంచిన ప్రతి మొక్కను నాటి పల్లెల్లో పచ్చదనం పరుచుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో, ప్రభుత్వ స్థలాల్లో, రోడ్ల వెంట, పార్కు స్థలాల్లో, నూతనంగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. నాటిన ప్రతి మొక్కను బతికించేందుకు గ్రామస్తుల సహకారం ఉండేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కలు చనిపోతే యువకులు, గ్రామస్తులు వెంటనే మండల స్థాయి అధికారులకు తెలియజేస్తే చనిపోయిన మొక్కల స్థానంలో మరో మొక్కను నాటేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలి



పల్లెల్లో నాటిన ప్రతి మొక్క బతికేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజాధనం దుర్వినియోగం చేయకూడదు. హరితహారంపై గ్రామీణులకు అవగాహన కల్పించాలి. గ్రామాల్లో యువకులు చైతన్యం కావాలి. మొక్కలు విరివిగా నాటాలి.

-కంచకుంట్ల సుభాష్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కన్వీనర్

గ్రామస్తులు సహకరించాలి



చండూరు, గట్టుప్పల మండలాల్లో హరితహారం కార్యక్రమం మొదలైంది. ప్రతి నర్సరీలో 5500 మొక్కల వరకు సిద్ధంగా ఉంచాం. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటుతున్నాం. మొక్కల సంరక్షణలో గ్రామస్తుల సహకారం ఉండాలి. ప్రతి మొక్కను బతికునేందుకు గ్రామస్తులు సహకరించాలి.

-శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీఓ

పేదింటి 'పెద్దయ్య'కు పెన్షన్ అందేనా !

- రోజు విడిచి రోజు డయాలసిస్
- సదరం సర్టిఫికెట్ అందజేసి రెండేళ్లు
- నేటికీ అందని ఆసరా పింఛన్



డయాలసిస్ బారిన పడిన పెద్దయ్య

మర్రిగూడ : అతడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి. డయాలసిస్ బారిన పడడంతో ఆయనకు జిల్లా అధికారులు రెండేళ్ల క్రితం సదరం సర్టిఫికెట్ జారీ చేశారు. కానీ పెన్షన్ అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన 64 సంవత్సరాల పోలగోని పెద్దయ్యకు రెండు కిడ్నీలు చెడిపోయాయి. రెండేళ్లుగా మందులు వాడినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆరోగ్యశ్రీ ద్వారా రోజు విడిచి రోజు డయాలసిస్ చేస్తున్నారు. పెద్దయ్య భార్య కృష్ణమ్మ చేసిన కూలీ డబ్బులతో ప్రయాణం, ఇతర ఖర్చులు, కుటుంబ పోషణ కొనసాగింది. గతేడాది ఆమెకు కూడా గర్భాశయ ఆపరేషన్ కావడంతో తేలికపాటి పనులకు మాత్రమే పరిమితమైంది. వీరికి ఎలాంటి ఆస్తులు లేవు. నలుగురు కూతుళ్లు ఉండగా వారందరికీ వివాహాలు చేశారు. నిరుపేద కుటుంబాన్ని ఆపదలో ఆదుకునేవారు కరువయ్యారని ఆందోళన చెందుతున్నారు. చివరికి ప్రభుత్వ అధికారులు కూడా కనికరం చూపడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. పింఛన్ కోసం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులను అడిగితే సైట్ ఓపెన్ కావడం లేదని సాకులు చెబుతున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దయ్యకు ఏప్రిల్ 25, 2022 సంవత్సరంలో 64 శాతం వైకల్యంతో జీవితకాలం సదరం సర్టిఫికెట్ అందించినప్పటికీ పెన్షన్ అందడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తమపై కనికరం చూపి పెన్షన్ అందించే విధంగా చొరవ చూపాలని పెద్దయ్య కోరుతున్నాడు.

నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ: నూతన కలెక్టర్ నారాయణరెడ్డిని మంగళవారం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, సిబ్బంది బి.శ్రీనివాసరావు, కొప్పు రాంబాబు, కె.నరేందర్‌రెడ్డి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వివిధ సంఘాల నేతలు

నల్లగొండ టౌన్ : నూతన కలెక్టర్ నారాయణరెడ్డిని మంగళవారం బీసీ సంఘం ప్రతినిధులు కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసోజు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, కేశబోయిన శంకర్‌ముదిరాజ్, ఆదినారాయణ, గుండ కోటప్ప, ఎల్లంరాజు, మధుయాదవ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సీపీఐ నాయకులు

నూతన కలెక్టర్ నారాయణరెడ్డిని మంగళవారం సీపీఐ నాయకులు కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, బొల్గూరి నర్సింహ, టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డిని మంగళవారం రెడ్‌క్రాస్ ప్రతినిధులు కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ డా.పుల్లారావు, మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దశరథ, సురెడ్డి సరస్వతి, కోటేశ్వర్‌రావు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంపీపీ శ్రీదేవి



విద్యార్థులను ఊరేగించే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మంగళపల్లి గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం బీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సెస్సీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గ్రామస్తులు భారీ ప్రదర్శనగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారిని జ్ఞాపికలతో సత్కరించారు. పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ముందస్తు చర్యలు చేపట్టారని అన్నారు. మంగళపల్లి పాఠశాలలో 200 మంది విద్యార్థులను చేర్పించినట్లయితే పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పాఠశాల అభివృద్ధి కోసం వివిధ సేవా కార్యక్రమాలు చేసిన బీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్, ఎంపీపీ శ్రీదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ మేకల నాగయ్య, చామల శ్రీనివాస్, హెచ్ఎం కర్ర వీరారెడ్డి, మర్రూరు ఎంపీటీసీ వీరార్జున్‌రెడ్డి, నకిరేకంటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

కేతేపల్లి: పిల్లల్లో నులి పురుగుల నివారణకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మండల వైద్యాధికారి అర్చన అన్నారు. మంగళవారం కేతేపల్లిలోని పీహెచ్‌సీలో నులి పురుగుల నివారణపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. నులి పురుగుల నివారణకు ఈ నెల 20న మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీహెచ్ఓ సుందర్‌నాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు జగదీష్‌రెడ్డి, కమల, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గండికోట రాజమణి హరికృష్ణ అధ్యక్షతన ఈ నెల 20న ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లపై మంగళవారం మునుగోడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు వ్యాపారులు శాండ్ ట్యాక్సీ పేరుతో కొరటికల్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారిని పట్టుకునేందుకు నిఘా పెట్టగా మంగళవారం అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టుబడ్డాయని, వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్లతోపాటు, వాటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చండూరు ఎంపీపీగా అవ్వారి గీత



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎంపీపీ గీత

చండూరు : చండూరు ఎంపీపీగా గట్టుప్పల్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు అవ్వారి గీత శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 10 మంది ఎంపీటీసీలు ఉండగా సమావేశానికి ఐదుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు హాజరయ్యారు. మెజార్టీ సభ్యులు అవ్వారి గీతను ఎంపీపీగా ఎన్నుకున్నారు. మాజీ ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్‌తోపాటు, పెందోట వెంకటమ్మ, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీలు ఎంపీపీ ఎన్నికకు హాజరు కాలేదు. గతంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించిన సమయంలో కోరం లేక వాయిదా పడింది. ఈసారి కోరంతో సంబంధం లేకుండా వచ్చిన మెజార్టీ సభ్యులతోనే ఎంపీపీ ఎన్నిక నిర్వహించినట్లు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఉన్న అవ్వారి గీత పూర్తిస్థాయి ఎంపీపీ బాధ్యతలు చేపట్టారు.

కేజీబీవీలో వసతులు కల్పించాలి

మాడుగులపల్లి : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో అన్ని వసతులు కల్పించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. మండలంలోని కుక్కడం గ్రామంలో నిర్వహిస్తున్న వేములపల్లి మండలానికి చెందిన కేజీబీవీని మంగళవారం ఆయన పరిశీలించారు. సర్కారీ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా మాడుగులపల్లి మండల పరిధిలోనే పాఠశాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీని ఇతర ప్రదేశానికి తరలించేది లేదన్నారు. ఎమ్మెల్యే వెంట వేములపల్లి ఎంపీపీ పుట్టల సునీతకృపయ్య, ఎంఈఓ బాలాజీనాయక్, కేజీబీవీ ప్రత్యేకాధికారి వసంత, ఉపాధ్యాయినులు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర



శోభాయాత్ర సందర్భంగా కోలాటం ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు



వేడుకల్లో పాల్గొన్న హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు

రామగిరి(నల్లగొండ): హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ శోభాయాత్ర ర్యాలీ మంగళవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రామగిరి రామాలయం నుంచి బస్టాండ్, క్లాక్ టవర్ మీదుగా శివాజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనగణమణ ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శివాజీ ఫౌండేషన్ చైర్మన్ చౌహాన్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఈద్గా ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆ గ్రామంలోని మసీదు కమిటీ సభ్యులు మంగళవారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్, ఉస్మాన్, గాలీఫ్‌ఖాన్, సమీర్, గాలీఫ్, అన్వర్, అసద్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నమ్ముల విజయ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ దోర్నాల రామచంద్రం, దుబ్బ కుమార్, రాచకొండ శ్రీను, బొడిగె బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందిస్తున్న మసీదు కమిటీ సభ్యులు

వర్షాలు కురవాలని బొడ్రాయికి పూజలు



చెర్వుగట్టులో బొడ్రాయికి నీళ్లు పోస్తున్న మాజీ సర్పంచ్ బాలకృష్ణ

నార్కట్‌పల్లి : వర్షాలు కురవాలని కోరుతూ చెర్వుగట్టు, నెమ్మాని గ్రామాల్లో గ్రామస్తులు మంగళవారం బొడ్రాయికి, గ్రామ దేవతలకు నీళ్లు పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో చెర్వుగట్టు గ్రామ మాజీ సర్పంచ్ మల్గ బాలకృష్ణ, చీర మల్లేష్, భిక్షం, బండ లింగస్వామి, కడగంచి శంకర్, మేటి లక్ష్మణ్, మందుల నర్సింహ, కోడూరి మల్లయ్య, గంట శేఖర్, చీర శంకర్, నెమ్మాని గ్రామానికి చెందిన అల్లుబెల్లి మధుసూదన్‌రెడ్డి, ఏళ్ల రఘుపతిరెడ్డి, చలపతిరెడ్డి, మేకల వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, ఎల్లేష్, వనజాత, జయమ్మ, లక్ష్మి, అనసూర్య, గీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వ్యాల్యుయేషన్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

నల్లగొండ : భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపునకు సంబంధించి వ్యాల్యుయేషన్ కమిటీ సమావేశం మంగళవారం నల్లగొండ ఆర్డీఓ రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ రిజిస్ట్రార్లతో పాటు తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఏ ప్రాంతాల్లో భూముల విలువ పెంచేందుకు అవకాశం ఉందో వాటిని గుర్తించి తహసీల్దార్లు వివరాలు ఇవ్వాలని ఆర్డీఓ సూచించారు. గ్రామ పంచాయతీల్లో కమర్షియల్ బిల్డింగ్‌ల వివరాలు ఇవ్వాలని ఎంపీడీఓలకు సూచించారు. సమావేశంలో నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

చౌటుప్పల్ : మండల పరిధిలోని పెద్దకొండూర్ గ్రామంలోని సాయియాదాద్రి వృద్ధాశ్రమంలో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొబైల్ మెడీకేర్ యూనిట్‌లో భాగంగా పరీక్షలు నిర్వహించి అవసరమైనవారిని మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చల్లా జయశ్రీ, రెడ్‌క్రాస్ వైస్ ప్రెసిడెంట్ దిడ్డి బాలాజీ, సొసైటీ ప్రతినిధులు ఉపేందర్‌రావు, స్పందన, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులను సీజ్ చేయాలి

మిర్యాలగూడ : ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం, మాలమహానాడు విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఈఐ వీరస్వామికి వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, మాలమహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

నార్కట్‌పల్లి : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించి.. నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సీపీఐ (ఎం) రాజకీయ శిక్షణ తరగతులకు నార్కట్‌పల్లి మండలం నుంచి 15 మందిని ఎంపిక చేశామని వివరించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, మండల కమిటీ సభ్యులు దండు రవి, దండు నాగరాజు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

వీధి దీపాలు లేక ఇబ్బందులు

- రాత్రి వేళ ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- జీఎంఆర్ సిబ్బంది స్పందించాలని విజ్ఞప్తి



వెలిమినేడులో జాతీయ రహదారిపై పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే ప్రదేశం

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారిపై వీధి దీపాలు లేక వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వెలిమినేడు గ్రామ పరిధిలోని జాతీయ రహదారి దుకాణాలు, ఇండ్లు, గ్రామాలకు వెళ్లే ప్రదేశాల్లో యూటర్న్‌లు రోడ్డులు, సర్వీస్ రోడ్డు సుమారుగా కిమీ దూరానికి పైగా ఉంటుంది. కానీ రహదారికి ఇరువైపులా ఆరు చోట్ల మాత్రమే వీధి దీపాలు ఏర్పాటు చేశారు. వాహనదారుల, పాదాచారుల అవసరాల మేరకు పూర్తి స్థాయిలో లైట్స్‌ను ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారిపై నుంచి దిగి గ్రామం లోపలికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్ల ప్రారంభాల్లో పిట్టంపల్లి గ్రామానికి వెళ్లేందుకు, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని యూటర్న్‌ల వద్ద జాతీయ రహదారిపై లైట్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ యూటర్న్‌ల వద్ద ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు జాతీయ రహదారిపై నుంచి అతివేగంగా వెళ్లే వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటి వరకు ఈ యూటర్న్‌ల వద్ద పదుల సంఖ్యలో గాయపడగా, మరికొందరు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. అంతేకాకుండా పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో వర్షపునీరు వెళ్లేందుకుగా ఏర్పాటు చేసిన డ్రైయినేజీని పూడ్చివేశారని, నిబంధనలకు విరుద్ధంగా యూటర్న్ వద్ద పెట్రోల్ బంకును ఏర్పాటు చేసినట్లు ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు దేశబోయిన స్వరూప నర్సింహ పేర్కొన్నారు. లైట్స్‌ను ఏర్పాటు చేయాలని పలుమార్లు జీఎంఆర్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆమె వాపోయారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని వెలిమినేడు గ్రామ పరిధిలోని జాతీయ రహదారి పొడవునా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు, వాహనదారుల కోరుతున్నారు.